సాక్షి
ఎన్టీఆర్ జిల్లా
ఆదివారం । 16 । మార్చి । 2025




నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో నిత్యాన్నదానానికి శనివారం పోరంకికి చెందిన మాగంటి కొండయ్య కుటుంబం రూ.1,00,116 విరాళాన్ని అందజేసింది.



హుండీ ఆదాయం రూ.7.12 లక్షలు

పామర్రు: ఉండ్రపూడి వీరాంజనేయస్వామి ఆలయంలోని హుండీలో కానుకలు లెక్కించగా రూ.7.12లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో పీవీఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
విజయవాడ	6.23	4.56
మచిలీపట్నం	6.22	4.55

న్యూస్‌రీల్

పీఎస్‌కు వాహనం బహూకరణ



నాగాయలంక: ప్రకృతి విపత్తులకు గురవుతున్న తీరప్రాంతమైన మండలంలో శాంతి భద్రతలు, ప్రజా సంరక్షణ సులభతరం కావడానికి నాగాయలంక పోలీస్‌స్టేషన్‌కు లిఖిత ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రై.లిమిటెడ్ అధినేత గడ్డపాటి శ్రీనివాసరావు రూ.13 లక్షల విలువైన వాహనం బహూకరించారు. తమ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఈ వాహనాన్ని సమకూర్చారు. దాత శ్రీనివాసరావుకు ఎస్పీ గంగాధరరావు జిల్లా పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో దాత గడ్డిపాటి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. వాహనానికి ఎస్పీ, దాత జెండా ఊపి నాగాయలంక పంపించారు. స్థానిక స్టేషన్‌కు ఆధునిక వాహనం అందజేసిన శ్రీనివాసరావును కలిదిండి ఎస్ఐ రాజేష్, సిబ్బంది, గ్రామ ప్రముఖులు, ప్రజలు అభినందించారు.

18న జాబ్‌మేళా

గన్నవరం/చిలకలపూడి(మచిలీపట్నం): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18వ తేదీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీనిలో బజాజ్ క్యాపిటల్, ఫ్లిప్‌కార్ట్, శ్రీరామసాయి ఆఫీస్ సొల్యూషన్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్, డిప్లమో, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆసక్తికరమైన వేతనం, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నైపుణ్యాభివృద్ధి వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావడం, బయోడేటా ఫాంతో పాటు పాన్‌కార్డ్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో మంగళవారం హాజరుకావాలని సూచించారు. ఇతర సమాచారానికి 94940 05725 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సొరంగం లీకేజీలకు మరమ్మతులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడలోని చిట్టినగర్ సొరంగంలో లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. సొరంగంలో లీకవుతున్న నీటిధారలు వాహనచోదకులు, పాదచారులపై పడుతున్నాయి. దీనికోసం కొద్ది రోజుల క్రితం నీటిధారలు పడుతున్న ప్రాంతంలో గడ్డర్లు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం వాటి వద్ద మరమ్మతులు చేపట్టారు. దీంతో సాయంత్రం 6 గంటల నుంచి సొరంగం మీదగా రాకపోకలను నిలిపివేశారు. కాలేజీలు, ట్యూషన్ల నుంచి వచ్చే వారు కబేళా, పాల ప్రాజెక్టు మీదగా తిరిగి రావాల్సి వచ్చింది. పాదచారులు, సైకిల్‌పై వచ్చే వారిని మాత్రం సొరంగం లోపల నుంచి అనుమతించారు. కార్పొరేషన్ అధికారులు ముందస్తుగా ఎటువంటి సూచనలు లేకుండా రాకపోకలు నిలిపివేయడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయానికి మరమ్మతులు పూర్తవుతాయని కార్పొరేషన్ సిబ్బంది పేర్కొంటున్నారు.

సారా కట్టడికి కఠిన చర్యలు



తిరువూరు: కాపు సారా నిర్మూలనకు మరింత కఠినంగా వ్యవహరించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ తిరువూరు ఎక్సైజ్ అధికారుల్ని ఆదేశించారు. శనివారం తిరువూరు ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. నవోదయం అమలు, సారా నిర్మూలన విషయంలో అలసత్వం వద్దని సూచించారు. పదే పదే నేరాలు చేసే నిందితులపై పీడీ చట్టం నమోదు చేయాలని శర్మ తెలిపారు. అనంతరం వేమిరెడ్డిపల్లి తండాలో జరిగిన నవోదయంలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుబాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాంశివ, తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చబంగారం.. నేలచూపు

- జిల్లాలో మొదలైన పసుపు దుంప తవ్వకాలు
- దిగుబడులు ఆశాజనకం
- మార్కెట్‌లో తగ్గుతున్న ధర
- రేటు పెరుగుతుందనే ఆశతో రైతులు



కంకిపాడు మండలం గొడవర్రులో పసుపు దుంప వేరు చేస్తున్న కూలీలు

కంకిపాడు: పసుపును బంగారంతో పోలుస్తారు. పసిడి ధర మాత్రం ఆకాశాన్నంటుతుంటే పచ్చ బంగారం మాత్రం నేలచూపులు చూస్తోంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేక ఆరుగాలం శ్రమించి పంటను కాపాడుకున్న రైతు ఆందోళన చెందుతున్నాడు. నాణ్యమైన దిగుబడులకు మంచి ధర వస్తుందనే ఆశతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. పచ్చబంగారంగా పిలిచే పసుపు పంట ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటి. ఈ ఏడాది కృష్ణా జిల్లా వ్యాప్తంగా 5,031 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలోని 707 ఎకరాల్లో పసుపు సాగు జరిగింది. కడప, మైదుకూరు, ప్రగతి, శీలం, స్థానిక విత్తన రకాలను రైతులు సాగుకు ఎంపిక చేసుకున్నారు. పంట కాలం పూర్తికావడంతో గడిచిన 20 రోజులుగా రైతులు పసుపు ఆకుతీత, దుంప తవ్వకం పనులను చేపడుతున్నారు.

ఖర్చు అధికం

ఈ ఏడాది పసుపు సాగు ఖర్చులు భారీగా పెరిగాయి. ఎకరాకు ఆరు పుట్లు పసుపు విత్తనం కొనుగోలు చేసి సాగు చేసుకున్నారు. గతంలో రూ.3,500 నుంచి రూ.4 వేలకు విత్తనం పసుపు కొమ్ములు లభించేవి. విత్తనం కొమ్ములు లభ్యత లేకపోవడంతో డిమాండ్ పెరిగింది. ఆరు పుట్లు విత్తనం కొనుగోలుకే రూ.60 వేల నుంచి రూ.65 వేలు వరకూ పెట్టుబడులు పెట్టారు. కౌలు ఒప్పందం రూ. 35 వేల నుంచి రూ.40 వేలు ఉంది. పంట సాగు, యాజమాన్యానికి మరో రూ.60 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంట కాలంలో కురిసిన భారీ వర్షాలు, ఏటిపాయ వెంట సాగు చేపట్టిన పసుపు పొలాలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు వర్షాలకు పసుపు చేలల్లో నీరు నిలిచి దుంప కుళ్లు ఆశించింది. దీంతో పంట సంరక్షణ చర్యలకు రైతులు నానా పాట్లు పడ్డారు. ప్రస్తుతం ఆకుతీత, దుంప తవ్వకం పనులు చేపట్టేనాటికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకూ



పసుపు దిగుబడి

పెట్టుబడులు పెట్టారు.

దిగుబడులు ఆశాజనకమే

భారీ వర్షాలు, తెగుళ్ల సమస్యతో దిగుబడులు తగ్గుతాయని రైతులు భావించారు. దుంప కుళ్లు ఆశించిన ప్రాంతాల్లో మినహా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు పచ్చి కొమ్ములు 65నుంచి70 పుట్లు (పుట్టు 225 కిలోలు) వస్తుందంటున్నారు. వంట పూర్తి చేసి, ఎండబెట్టిన తర్వాత ఎకరాకు సుమారుగా 20 నుంచి 26 క్వింటాళ్ల వరకూ దిగుబడి చేతికందే అవకాశం ఉందని ఆశిస్తున్నారు.

ధర రోజు రోజుకీ తగ్గుముఖం

పసుపు పంట ధర చూసి రైతులు నీరసించిపోతున్నారు. మార్కెట్‌లో రోజు రోజుకీ ధర తగ్గుముఖం పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో క్వింటా పసుపు కొమ్ముల ధర రూ.14,500 నుంచి రూ. 15,000 పలికింది. క్రమంగా రేటు తగ్గుతూ వచ్చింది. సిండికేట్ మాయాజాలం కారణంగా చాలా రోజులు క్వింటా ధర రూ.12 వేలు దాటని దుస్థితి. ప్రస్తుతం పంట చేతికొస్తోంది. ఈ పరిస్థితుల్లో రైతులు మార్కెట్‌లో గంపెడాశతో ఉన్నారు. క్వింటా రూ.13 వేలు చేరుతుందని ఆశించారు. అయితే మార్కెట్‌లో మాత్రం రూ.9500–రూ.9800 లోపు పలుకుతోంది. నాణ్యమైన పంట దిగుబడులు ఉన్నాయని, మార్కెట్‌లో మంచి ధర లభిస్తే పెట్టుబడులు పూర్తిగా చేతికొచ్చి సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. వంట పనులు చేసేనాటికి ధర ఆశాజనకంగా ఉండొచ్చని ఆశలు భావిస్తున్నారు.

ఎంతో ఆశతో ఉన్నాం



రెండెకరాల్లో పసుపు పంట సాగు చేశాను. విత్తనం ధర భారీగా పెరగడంతో పెట్టుబడులు కూడా రూ.1.60 లక్షలు ఎకరానికి అయ్యాయి. వంట పూర్తై, ఎండ బెట్టిన కొమ్ములు మార్కెట్‌కు వచ్చే నాటికి మరో రూ.50 వేలు దాటుతుంది. ధర క్వింటా రూ.9600 అంటున్నారు. దిగుబడి నాణ్యంగా ఉంది. ధర కూడా పెరుగుతుందనే ఆశతో ఉన్నాం.

– దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రైతు, చలివేంద్రపాలెం

విజయోస్తు..

- రేపటి నుంచి 'పది' పరీక్షలు
- కృష్ణాలో 22,341 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 31,231 మంది టెన్త్ విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో 313 కేంద్రాలు
- ఎన్టీఆర్ జిల్లాలో ఆరు సమస్యాత్మక కేంద్రాలు
- రెగ్యులర్‌తో పాటే ఓపెన్ స్కూల్ 'పది' పరీక్షలు



విజయవాడలోని కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 31,231 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీటి కోసం 168 కేంద్రాలను ఏర్పాటుచేశారు. బాలురు 14,212 మంది, బాలికలు, 17,019 మంది పరీక్షలు రాస్తున్నారు. వీరిలో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం విద్యార్థులు 1,743 మంది పరీక్షకు హాజరుకానున్నారు. కృష్ణా జిల్లాలో వివిధ విద్యాసంస్థల నుంచి 22,341 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. 145 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోనే ఓపెన్ పది పరీక్ష రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలు అనగానే విద్యార్థుల్లో తెలియని ఆందోళన. తెలిసిన సమాధానాలే అయినా పేపర్ పెట్టేటప్పుడు సతమతమవుతారు. ఆ చిన్న అవరోధాన్ని అధిగమిస్తే విజయం సొంతమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

2,136 మంది సిబ్బంది

ఎన్టీఆర్ జిల్లాలో జరిగే పరీక్షలకు సుమారుగా 2,136 మంది ఉపాధ్యాయులను వినియోగిస్తున్నారు. అందులో డిపార్ట్‌మెంటల్ అధికారులుగా 168 మందిని, చీఫ్ సూపరింటెండెంట్లుగా 168 మందిని, కస్టోడియన్లుగా 50 మందిని, ఇన్విజిలేటర్లుగా 1,750 మంది సేవలందిస్తున్నారు. సబ్జెక్ట్ టీచర్లకు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరిగే రోజున విధులను మార్పు చేస్తారు.

ప్రశ్నపత్రానికి క్యూఆర్ కోడ్

ఈ ఏడాది సైతం సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ప్రశ్నపత్రానికి ఒక క్యూఆర్ కోడ్‌ను ఇవ్వడంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు చోటు ఇవ్వకుండా చర్యలు తీసుకున్నారు. నో మొబైల్ జోన్‌గా పరీక్ష కేంద్రాలను, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు ప్రకటించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లోని ఆరు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అప్రమత్తం చేస్తున్నారు. తిరువూరు, నందిగామలోని శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలతో పాటు జగ్గయ్యపేటలోని చేగు విద్యాలయం, మైలవరంలోని ఎస్ఎస్‌కే ఉన్నత పాఠశాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. గుర్తించిన కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు పరిశీలించనున్నాయి.

వినియోగదారులు హక్కులను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులు హక్కులపై తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకుని పరిరక్షించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పౌర సరఫరాల శాఖ దీపం 2 పథకం, ఆహార భద్రత ప్రమాణాలు, తూనికలు–కొలతల శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన వస్తువు నాణ్యత, పరిమాణం, ధర ప్రమాణాలకు సంబంధించి తగిన సమాచారాన్ని కలిగి ఉండడమే కాక ఏదైనా దుష్ప్రవర్తనకు వ్యతిరేకంగా రక్షించే హక్కు వినియోగదారు హక్కు అని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని, నిత్య జీవితంలో రోజూ ఏదో ఒక వస్తువును కొనుగోలు చేస్తుంటారన్నారు. ప్రజలు మోసానికి గురైతే పోనీలే అనే నిర్లిప్త ధోరణిని వీడి వినియోగదారుల హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ ఏడాది సుస్థిర జీవనశైలికి మార్పు ఇతివృత్తంతో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని వివరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థలు కీలక భాగస్వాములవుతున్నాయని తెలిపారు. అధికారులు కూడా ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా అప్రమత్తతతో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. మారుతున్న అవసరాలు, మార్కెట్ ధోరణులు, సాంకేతికత అనుసంధాన ఈ–కామర్స్, ఆన్‌లైన్ లావాదేవీలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టాలు అమలవుతున్నాయని జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు శశికళ వివరించారు. యూఎన్‌వో మార్గదర్శకాలు తదనంతరం చట్టాల రూపకల్పన, 1986 నాటి చట్టం, 2019 చట్టంలోని ముఖ్యాంశాలు తదితరాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఎస్‌వో ఎ.పాపారావు, లీగల్ మెట్రాలజీ అధికారి ఎ.కృష్ణచైతన్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన

విజయవాడ కల్చరల్: ఏపీ సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, దక్షిణమండల సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యాన 6 రోజుల పాటు నిర్వహించే సురభి నాటకోత్సవాలు దుర్గాపురంలోని సంగీత కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్, విజయ భారతి నాట్యమండలి ఆధ్వర్యాన సురభి జయచంద్రవర్మ పర్యవేక్షణలో భక్తప్రహ్లాద నాటకాన్ని రసరమ్యంగా ప్రదర్శించారు. ఒకే కుటుంబానికి చెందిన 50 మంది చిన్నా పెద్దా కళాకారులు పాల్గొనడం విశేషం. తొలుత నాటకోత్సవాలను గ్రీవెన్స్ అధికారి చిన్నారావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సురభి నాటకాలకు 140 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. భాషా సాంస్కృతిక శాఖ ఉప సంచాలకుడు పెంచలయ్య సురభి నాటకంపై మాట్లాడారు. నర్తనం ప్రధాన సంపాదకురాలు మాధవి పురాణం సురభి నాటక ప్రస్థానం అంశంగా ప్రసంగించారు. కార్యక్రమాన్ని అంతర్జాతీయ నాట్యాచారిణి స్వర్ణలత నిర్వహించారు.



భక్తప్రహ్లాద నాటకంలో ఓ సన్నివేశం

అన్ని రంగాల్లో అగ్రగామిగా 'ఎన్టీఆర్'

సీసీఎల్‌ఏ కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి



మాట్లాడుతున్న సీసీఎల్‌ఏ కమిషనర్ జయలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లోను అగ్రగామిగా నిలపాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్‌ఏ), జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆయా శాఖల ప్రగతిని జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యతా రంగాలు, కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి నెలా ముందస్తు టూర్ ప్రోగ్రామ్‌ను నిర్దేశించుకొని పర్యటిస్తే క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సమన్వయంతో పరిష్కరించవచ్చన్నారు. ప్రజలు అందజేస్తున్న అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, మైన్స్, తదితర శాఖలు జిల్లా స్థాయిలోనే లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జాబ్ మేళా నిర్వహణ, ఉద్యోగ కల్పన తదితర లక్ష్యాలను పూర్తి చేశామన్నారు. సమావేశంలో వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో శ్రీలత, ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ రథోత్సవం



అమ్మవారి రథోత్సవంలో ఈవో కిషోర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ చిన్న తిరునాళ్లలో రెండో రోజు శనివారం రాత్రి గోపయ్యసమేత తిరుపతమ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఉత్సవమూర్తులను అలంకరించిన రథంపై ఉంచారు. రథం ముందు రజకులు, శాలివాహనులు కుంభం పోసిన అనంతరం డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ ఎల్.రమ, పాలకవర్గసభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పొలాది వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథోత్సవం సాగింది. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఏఈవోలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, చుంచు రమేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి గం.9.05 గంటలకు దివ్య ప్రభోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ తెలిపారు.

ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వండి

- బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చేందుకు సమ్మర్‌లో క్యాంపెయిన్ నిర్వహించాలి
- చేనేత కార్మికులకు రుణాలపై బ్యాంకర్లతో మాట్లాడండి
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికారులు క్షేత్రస్థాయిలో కార్యక్రమం చేసేటప్పుడు ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ హాల్లో శనివారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. తొలుత స్వచ్ఛాంధ్రలో భాగంగా సభ్యులు, అధికారులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన గ్రామీణాభివృద్ధి స్థాయి సంఘ సమావేశంలో ఉపాధి కల్పన అధికారి విక్టర్‌బాబు నిరుద్యోగులకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. జాబ్ మేళాలపై తమకు సమాచారమిస్తే గ్రామాల్లో తెలియజేస్తామని, చెప్పకుండా నిర్వహిస్తే ఎలా అని జెడ్పీటీసీ సభ్యులు వాపోయారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ జాబ్‌మేళా నిర్వహించేటప్పుడు మైక్ ఎనౌన్స్‌మెంట్, టాంటాం ద్వారా తెలియజేయాలన్నారు. ఎంపీడీవోలకు కూడా సమాచారమివ్వాలన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడండి

విద్య, వైద్య స్థాయి సంఘ సమావేశంలో చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జరగనున్న 'పది' పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. స్ఫూర్తి మెటీరియల్, పౌష్టికాహారంతో విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని అప్పుడే తాము కేటాయించిన నిధులకు సార్థకత చేకూరుతుందన్నారు. వైస్‌చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు మాట్లాడుతూ నూజివీడు మండలంలో మూగ, చెవుడు, అంగవైకల్యం కలిగిన విద్యార్థులు సుమారు 50 మంది వరకు ఉన్నారని వీరికి ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ రాబోయే విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసి సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండేలా సర్దుబాటు చేయాలన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపడానికి సమ్మర్‌లో క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు.

బర్డ్ ఫ్లూతో చనిపోయిన కోళ్లకు నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోండి

కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయని అందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారని చైర్‌పర్సన్ అడిగారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి చిన నరసింహులు మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన ప్రాంతాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. కొన్నిప్రాంతాల్లో బొబ్బలు వచ్చి దూడలు చనిపోతున్నాయని పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి కాపాడాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పీఎం సూర్యఘర్ ద్వారా సౌర ఫలకాల ఏర్పాటుకు అవగాహన కల్పించాలన్నారు. మత్స్యకార భరోసా కింద వేట నిషేధ భృతిని అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికులకు ష్యూరిటీ లేకుండా ముద్ర రుణాలు అందేలా బ్యాంకు అధికారులతో మాట్లాడాలన్నారు. గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ మాట్లాడుతూ గూడూరు సీహెచ్‌సీలో గతంలో ఓపీ 200 పైగా ఉండేదని ప్రస్తుతం 50 మంది కూడా రావడం లేదన్నారు. ఎక్స్‌రే తీయడానికి సీఆర్ మిషన్ లేక వినియోగంలో లేదని దాన్ని వాడుకలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనులు, ఆర్థిక స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనందకుమార్, జెడ్పీటీసీ సభ్యులు ఊట్ల నాగమణి, కూనపరెడ్డి స్వరూపరాణి, భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సీహెచ్ అనూష, సువర్ణరాజుతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెట్రోలియం ట్యాంకర్స్ ఆపరేటర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం ట్యాంకర్ల ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో శనివారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో మూడేళ్ల పదవీ కాలానికి నూతన కమిటీ ఎన్నికైంది. అసోసియేషన్ చైర్మన్‌గా వై.వి.ఈశ్వరరావు, అధ్యక్షుడిగా డి.ఆర్.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జి.రమేష్, కె.పెదకాపు, ఎస్.విజయభాస్కర రెడ్డి, కార్యదర్శిగా ఎం.కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా జి.రాము, సయ్యద్ షమీర్ హుస్సేన్, కుమ్మరి వెంగళరావు, కోశాధికారిగా ఆర్.వెంకట రమణామూర్తిరాజు, కో ఆప్టెడ్ ఉపాధ్యక్షుడిగా గల్లా శ్రీధర్, కో ఆప్టెడ్ సహాయ కార్యదర్శిగా పిట్టా నాగభూషణం ఎన్నికయ్యారు.

గుండేరు డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి



దేవరకోట(ఘంటసాల): బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు గుండేరు డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన కొడాలి రవి కుమార్ అలియాస్ డేవిడ్ (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం దేవరకోట గ్రామంలోని గుండేరు డ్రెయిన్ సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. ఫిట్స్ వచ్చి ప్రమాదవశాత్తు డ్రెయిన్‌లో పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు డేవిడ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నలుగురితో కలివిడిగా ఉండే డేవిడ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌తో అనర్థాలు

భూపరిపాలన చీఫ్ కమిషనర్ జయలక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న సీసీఎల్‌ఏ కమిషనర్ జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర భూపరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్‌ఏ) జి.జయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జూపూడిలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ కమిషనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను తిరిగి వినియోగించకుండా మనం చేసే చిరు ప్రయత్నం భావి తరాల బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతుందన్నారు. వాడేసిన ప్లాస్టిక్ లోని మైక్రో ప్లాస్టిక్‌తో క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయని హెచ్చరించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వచ్ఛత ఔన్నత్యాన్ని చాటి చెప్పి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను తిరిగి వినియోగించకుండా పెద్దఎత్తున అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంతో ఆస్పత్రులు, పారిశ్రామిక యూనిట్లు, పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, ప్రభుత్వ కార్యాలయాలు ఇలా ప్రతి చోటా స్వచ్ఛతా పరిమళాలు వెల్లివిరియాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిషేధాన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీ, విక్రయాల ప్రక్రియను పరిశీలించి మొక్కలు నాటారు. ప్లాస్టిక్ నిషేధం పై ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, సర్పంచ్ కె.దేవమాత, డీపీఓ పి.లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సునీతశర్మ, ఈఓపీఆర్డీ మనోజ్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువగళం హామీలు అమలు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు, యువతకు యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని లెనిన్ సెంటర్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం ధర్నా జరిగింది. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు, పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షను పాత పద్ధతుల్లో నిర్వహించాలని, వెటర్నరీ విద్యార్థుల స్టైపెండ్ రూ.25 వేలకు పెంచాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 107, 108 జీఓలను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ ధర్నాను ఉద్దేశించి శివారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలు రద్దు చేసి, ఆయా యూనివర్సిటీలు సొంతగా ప్రవేశ పరీక్షలు నిర్వహించే వెసులుబాటు కల్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలరాజు, బందెల నాసర్ జీ మాట్లాడుతూ.. పశువైద్య విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కుళ్లాయిస్వామి, సాయికుమార్, చలపతి, నాగభూషణం, ఫణీంద్ర, షాబీర్ బాషా, నవ్య శ్రీ, రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీల సలహాలు సూచనలను ముఖ్య ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్తామని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో భారత ఎన్నికల సంఘం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిర్వహణను బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలతో ప్రతినెలా సమావేశం నిర్వహించి సలహాలు సూచనలు స్వీకరించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల ప్రతినిధులు సలహాలు, సూచనలు తీసుకున్నారు. కొత్త ఎపిక్ కార్డులు జారీ చేయాలని కలెక్టర్‌ను పలువురు కోరారు. పోలింగ్ జరిగే సమయంలో ప్రజాప్రతినిధులు పోలింగ్ కేంద్రంలోకి రాకుండా నివారించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

మచిలీపట్నంఅర్బన్: నగరంలోని బైపాస్ రోడ్డులో టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం శనివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. డ్రైవర్స్ కాలనీకి చెందిన అబ్దుల్ ఉస్మాన్ (70) మసీదులో నమాజ్ ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. చర్చి వద్ద మలుపు తిరిగేందుకు ప్రయత్నిస్తుండగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉస్మాన్ టిప్పర్ వెనుక టైరు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఉస్మాన్ కుమారుడు అబ్దుల్ కరీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కంచికచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. కంచికచర్లకు చెందిన జాలిపర్తి వీర మనోహర్(33) ఐదు నెలల క్రితం వీరులపాడు మండలంలోని జమ్మవరం గ్రామానికి చెందిన శ్రావణితో వివాహం జరిగింది. వీరమనోహర్ విజయవాడలోని ఓ ఆస్పత్రిలో మెయింటెనెన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల ఏడో తేదీన తన తల్లి, చెల్లి, బావ మధ్య ఆస్తి విషయంలో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన మనోహర్ గడ్డి మందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన అతడిని వైద్యం కోసం విజయవాడలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వచ్ఛ చల్లపల్లి రాష్ట్రానికే ఆదర్శం

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



చల్లపల్లిలో అధికారులు, స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి వీధులను శుభ్రం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని, రానున్న నెల రోజుల్లో ప్లాస్టిక్ క్యారీబాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యాక్రమంలో భాగంగా శనివారం తెల్లవారుజామున కలెక్టర్ బాలాజీ స్థానిక అధికారులు, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలతో కలిసి గ్రామాల్లోని వీధులను శుభ్రం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం, చల్లపల్లి ప్రధాన సెంటర్, షాబుల్‌బజార్ వీధిలో చీపురు చేతపట్టి పరిసరాలను శుభ్రపరిచారు. ప్రజల నుంచి వేరువేరుగా సేకరిస్తున్న చెత్తను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఎక్కడే లేని విధంగా కొన్ని సంవత్సరాల నుంచి నిత్యం తెలవారుజామున స్వచ్ఛ కార్యకర్తలు వీధులను శుభ్రం చేస్తుండటంతో చల్లపల్లికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ క్యారీబ్యాగుల విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. వ్యాపారులు కూడా వినియోగదారులకు ప్లాస్టిక్ క్యారీబ్యాగులకు ప్రత్యామ్నాయాలను వాడాలని సూచించారు. స్వచ్ఛ సుందర చల్లపల్లిని తీర్చిదిద్దడంతో కృషి చేస్తున్న సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావును అభినందించారు. స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డి.ఆర్.కె. ప్రసాద్, పద్మావతి దంపతులు, స్వచ్ఛ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రధాన పరీక్షలు



విజయవాడలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మూడు పరీక్షలు మినహా మిగిలిన పరీక్షలన్నీ పూర్తయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 103 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 80,272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు 2,285 మంది ఉన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరైన వారిలో మొదటి ఏడాది విద్యార్థులు 40,008 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 37,979 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒకేషనల్, బ్రిడ్జి కోర్సులకు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడు చొప్పున పరీక్షలు జరగాల్సి ఉంది. వీటికి హాజరయ్యే వారి సంఖ్య చాలా స్వల్పంగా కొన్ని కేంద్రాల్లో మాత్రమే పరీక్షలు జరగనున్నాయి.

స్వస్థలాలకు బయలుదేరుతున్న విద్యార్థులు

శనివారం పరీక్ష రాసిన తరువాత పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు సందడి చేశారు. పరీక్షలు పూర్తికావటంతో హాస్టళ్లను ఖాళీచేసి స్వస్థలాలకు బయలుదేరారు. ప్రధానంగా విజయవాడ పరిసర ప్రాంతాల్లో అనేక వేల మంది విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది విద్యార్థులు గురువారమే తమ ఊర్లకు వెళ్లిపోయారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం బయలుదేరారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- వెంకటేష్‌ను హతమార్చిన మిత్రులు
- మద్యం మత్తులో వివాదమే కారణం



వెంకటేష్ మృతదేహం

ఇబ్రహీంపట్నం: రౌడీషీటర్ జరబల వెంకటేష్ (42) తన స్నేహితుల చేతుల్లో దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో జరిగిన వివాదంలో మిత్రులు బండరాళ్లు, కర్రలతో వెంకటేష్‌పై దాడి చేశారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ లాంచీ రేవు సమీపంలో శనివారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్‌ఐ విజయలక్ష్మి కథనం మేరకు.. కంచికచర్లకు చెందిన జరబల వెంకటేష్ ఐదేళ్లుగా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ కాలనీలో నివసిస్తున్నాడు. టీడీపీ సానుభూతి పరుడిగా ఉండే వెంటేష్ స్థానికులతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి స్నేహితులు పెరుమాల వేణు, సీహెచ్.వీరాంజనేయులు, కొప్పనాతి వీర్రాజుతో కలసి మద్యం తాగాడు. మద్యం మత్తులో నలుగురు మధ్య తలెత్తిన గొడవ ఘర్షణకు దారితీసింది. వేణు, వీరాంజనేయులు, వీర్రాజు బండరాళ్లు, కర్రలతో దాడిచేసి వెంటేష్‌ను తీవ్రంగా గాయపర్చారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అతను మృతి చెందాడు. మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం కోసం తరలించారు. నిందితులు వేణు, వీరాంజనేయులు, వీర్రాజును గంటల వ్యవధిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కంచికచర్లకు చెందిన యార్లగడ్డ విజయ్ హత్యకేసులో వెంకటేష్ నిందితుడు కావడంతో పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. వెంకటేష్ హత్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.



జరబల వెంకటేష్ (ఫైల్)

వడ్డీతో బీమా మొత్తం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీ సహా బీమా మొత్తాన్ని 30 రోజుల్లో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మి రాయల శనివారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన ఎస్.వి.సాంబశివరావు 2020వ సంవత్సరంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ విజయవాడ బ్రాంచ్‌లో రూ.30 లక్షలకు ఆరోగ్య బీమా తీసుకున్నారు. ఈ బీమా మార్చి 2021 వరకు చెల్లుబాటులో ఉంది. ఈ పాలసీకి సాంబశివరావు తన భార్య మధుబాలను నామినీగా చేర్చారు. 2020 జూలై 17వ తేదీన ద్విచక్రవాహనంపై ప్రయాణం చేస్తుండగా ఆయన తీవ్ర గాయలపాలయ్యాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేరగా పరీక్షలు చేసిన వైద్యులు అతనికి కరోనా ఉందని నిర్ధారించారు. అనంతరం చికిత్స పొందుతూ సాంబశివరావు 2020 జూలై 27వ తేదీన మరణించాడు. మరణానంతరం భార్య మధుబాల ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా కరోనా రావటంతో బీమా వర్తించదని క్లయిమ్‌ను తిరస్కరించారు. దీంతో ఆమె వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా పూర్వాపరాలను విచారించిన అనంతరం సభ్యులు క్లయిమ్‌ను తిరస్కరించిన నాటి నుంచి బోనస్‌తో రూ.31,25,625, తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని, క్లయిమ్‌ను తిరస్కరించి, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.2 లక్షలు, ఖర్చుల నిమిత్తం మరో రూ.10 వేలు ఫిర్యాదుదారుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

వణుకూరులో వ్యక్తి అనుమానాస్పద మృతి

పెనమలూరు: మండలంలోని వణుకూరులో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థిలో మృతి చెందాడు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ కథనం మేరకు.. చిన్నం సంపత్ కుమార్ (40)కు వివాహం కాలేదు. అతని సోదరి వేముల కల్యాణి యనమలకుదురులో భర్తతో నివసిస్తోంది. వారి తల్లిదండ్రులు గతంలో మృతి చెందారు. సంపత్‌కుమార్ వణుకూరు గ్రామానికి చెందిన ఓ మహిళతో చింతా జ్యోతితో పరిచయం ఏర్పడి ఆమె వద్దే ఉంటున్నాడు. జ్యోతికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంపత్‌కుమార్ ఆస్తి విక్రయించగా వచ్చిన సొమ్ము, తన తల్లి బంగారాన్ని జ్యోతికి ఇచ్చాడు. సంపత్‌కుమార్ ఇటీవల సోదరి కల్యాణి ఇంటికి ఇటీవల వచ్చి తనను జ్యోతి ఇంటికి రానివ్వటం లేదని, ఇబ్బంది పెడుతోందని చెప్పి బాధపడ్డాడు. ఆ తరువాత వణుకూరుకు తిరిగి వెళ్లాడు. శుక్రవారం సంపత్‌కుమార్ వణుకూరు లైబ్రరీ వరండాలో ఉరి వేసుకుని ఉన్నాడని స్థానికుల ద్వారా కల్యాణికి సమాచారం అందింది. ఆమె వెళ్లి చూడగా సంపత్‌కుమార్ చనిపోయి ఉన్నాడు. ఈ ఘటనపై కల్యాణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇవిగో పూత రేకులు.. ఏదీ తీపి కబురు?

మంత్రి నిమ్మలకు పూత రేకులు పంపిన వలంటీర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వలంటీర్లు పూత రేకులు పంపారు. ఎన్నికల ముందు కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్ల గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని ఎన్నికల ప్రచారంలో మంత్రి రామానాయుడు వలంటీర్ల వద్ద ప్రస్తావించారు. అధికారంలోకి రాగానే రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని, తనకు పూత రేకులు తెచ్చివ్వాలని అప్పట్లో వలంటీర్లతో అన్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. కూటమి అధికారం చేపట్టాక గౌరవ వేతనం పెంచకపోగా వలంటీర్ వ్యవస్థనే రద్దు చేసింది. తమకు ఇచ్చిన హామీ అమలు చేయాలని వలంటీర్లు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్లు విజయవాడలో పూత రేకులు కొనుగోలు చేసి మంత్రి నిమ్మలకు కొరియర్ ద్వారా పంపారు. వలంటీర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు మాట్లాడుతూ.. 'వలంటీర్లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించింది. ఏకంగా వ్యవస్థనే రద్దు చేసింది. మేము మాత్రం మంత్రికి పూతరేకులు పంపుతున్నాం. మాకు తీపి కబురు ఎప్పుడు చెబుతారు?' అంటూ ప్రశ్నించారు. పూత రేకులు పంపిన వారిలో వలంటీర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు మాధవి, వలంటీర్లు కళ్యాణ్, రమేష్, స్వప్న, నరేష్ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నాలుగు వాహనాలను సీజ్ చేశారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాలలో వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ చోరీలపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా చోరీలకు పాల్పడింది వించిపేటకు చెందిన గేదెల యోసోబు అలియాస్ జాన్‌బాబుగా గుర్తించారు. శనివారం నిందితుడిని అరెస్టు చేసి చోరీ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.